# తొమ్మిదవ ప్రసంగము

తరువాతిరోజున ఉదయము స్నానాదులు నిర్వర్తించి శ్రీ నిత్యానందస్వామివారిచెంత అందరును కూర్చుండిరి. త్ర్యంబకభాయి ప్రశ్నించెను:—"గతరాత్రి 'మోఘాశా మోఘకర్మాణః' మొదలగు వాక్యములద్వారా అసురరాక్షసప్రకృతులను నిరూపించియుండిరి. ఇంక దైవప్రకృతి మిగిలియున్నది. దయయుంచి వివరించుడు." శ్రీనిత్యానందస్వామివారు ప్రకాశానందస్వామివారిని వివరించుమనిరి.

స్వా. ప్ర॥:— *మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతిమాశ్రితాః ।*
*భజన్త్యనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్ ॥*

"ఓఅర్జునా, దైవప్రకృతిని ఆశ్రయించి నన్నుతప్ప అన్యులను తలవని మహాత్ములు నన్ను ప్రతిప్రాణికిని కారణముగాను, నాశరహితుడనుగాను తెలిసికొని భజించెదరు."

గీత 16వ అధ్యాయమున దైవప్రకృతికి సంబంధించిన 26 గుణములు 3 శ్లోకములలో కలవు.

*1.* *అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగవ్యవస్థితిః ।*
*దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్ ॥*

"అభయము, అంతఃకరణపారిశుద్ధ్యము, జ్ఞానమునందును, యోగమునందును నిలకడగానుండుటయు, దానము, దమము, యజ్ఞము, స్వాధ్యాయము, తపము, సారల్యము."

*1.* *అభయమ్*:— భార్యాపుత్రాదులను విడచి ఒంటరిగా అరణ్యములోనికి వెళ్ళి యోగాభ్యాసమునకు కూర్చొనినప్పుడు "నా భార్యాబిడ్డల గతి ఏమగును?" అను భావము భయము. గీతయందే భగవానుడు "యోగక్షేమం వహామ్యహమ్" అనిచెప్పినాడు. యోగక్షేమములను ఆయన భరించును. అంతియేకాకుండ ప్రపంచమున

మానావమానములు, నింద, ధనాదులు నశించునేమోయను భావము, గౌరవహాని మొదలగు అనేకరకములగు భయములు ఉండును. ఈ విషయమున భర్తృహరి ఇట్లు చెప్పెను:—

*భోగే రోగభయం కులే చ్యుతిభయం విత్తే నృపాలాద్భయం*
*మానే దైన్యభయం బలే రిపుభయం రూపే జరాయా భయమ్*
*శాస్త్రే వాదభయం గుణే ఖలభయం కాయే కృతాన్తాద్భయం*
*సర్వం వస్తు భయాన్వితం భువి నృణాం వైరాగ్యమేవాఽభయమ్॥*

"భోగమునందు రోగము కలుగునను భయము, కులమునందు గౌరవభ్రష్టతాభయము, ధనమునందు రాజులు తీసికొనెదరను భయము, మానముగా నున్నచో దీనుడని అనుకొనెదరను భయము, బలము కలిగినచో శత్రువులవలన భయము, రూపము వార్ధక్యముచే పోవునను భయము, శాస్త్రజ్ఞానము వాదమునకు నిలబడదేమో అను భయము, గుణవంతునకు దుర్మార్గులనుండి భయము, శరీరమునకు యమునినుండి భయము– ఇట్లు ప్రపంచమునందలి అన్ని వస్తువులవిషయమునను మానవుడు భయపడవలసియున్నది. వైరాగ్యముమాత్రమే భయరహితమైనది." కావున వైరాగ్యముచే ముక్తిని పొందగోరు నరులు భయపడరాదు.

*2.* *సత్త్వసంశుద్ధిః*:- సత్త్వము అనగా అంతఃకరణము. అంతఃకరణమునందు రాగద్వేషములు పూర్తిగా లేనప్పుడు అది పూర్తిగ నిర్మలమును, పరిశుద్ధమును అగును. అదియే సత్త్వసంశుద్ధి. రాగము అనగా మాయాజన్యపదార్థములయందు భోగాపేక్ష. అది అసుర స్వభావము. ద్వేషము అనగా కాయిక, వాచిక, మానసిక మార్గముల ద్వారా ఇతరులను చంపవలెననియు, విషము నివ్వవలెననియు, బలవంతముగా ధనమును దొంగిలించవలెననియు, తప్పుడు సాక్ష్యములను సృష్టించి బలవంతముగా కోర్టునకు ఈడ్చవలెననియు, ఇట్టి క్రౌర్యప్ర

ధానకృత్యములు. అనగా రాక్షసస్వభావము. ఇవి అన్నియు నిర్మూలించబడిన అంతఃకరణము పూర్తిగా నిర్మలమును పరిశుద్ధమును అగును. దాని పేరే సత్త్వసంశుద్ధి. ద్వేషాదికమగు రాక్షసస్వభావము నిష్కామకర్మచే నివృత్తిని పొందును. రాగాదికమగు అసుర స్వభావము ఉపాసనచే నివృత్తిని పొందును.

*3.* జ్ఞానయోగవ్యవస్థితి:— పరోక్షముగా పరమాత్మస్వరూపముయొక్క యథార్థమును తెలిసికొనుట జ్ఞానము. దీనిని పొందుటకు మంత్రము, లయ, హఠ, రాజయోగములు నను నాల్గురకముల ప్రియత్నములు ఉన్నవి. అందు స్థిరముగానుండుట జ్ఞానయోగవ్యవస్థితి అనబడును.

*4.* దానమ్:— *స్తోకాదపి చ దాతవ్యమదీనేనాన్తరాత్మనా ।*
*అహన్యహని యత్కించదకార్పణ్యం తు తత్*
*స్మృతమ్॥ (బృహస్పతి)*

"తన అంతఃకరణమును ఉదారముగానుంచి తనవద్ద కొంచెము ఉన్నను, దానిలోనే కొంచెముకొంచెము ప్రితిరోజు ధర్మము చేయుట అకార్పణ్యము అనగా దానము అని చెప్పబడును."

మానవునకు ధనమునందు తృష్ణ అధికమైనకొలది దానము చేయుటయందు కష్టము తోచును.

*దానాన్న దుష్కరం తాత పృథివ్యామస్తి కించన ।*
*అర్థే చ మహతీ తృష్ణా స చ దుఃఖేన లభ్యతే ॥*

"దానముకంటె కష్టమైనది భూమిలో లేదు. ధనము అతికష్టముచే లభించును. కావుననే దానియందు అంత తృష్ణ."

అయినను దానము తన కర్తవ్యముగా భావించి నిష్కామ బుద్ధితో శక్తిననుసరించి,సమయమును, పాత్రిను,విచారించి అన్నము, వస్త్రము, విద్య, ఔషధము మొదలగునవి దానముచేయుట మానవుని విధి.

*5.* దమః—దమమునుగురించి శ్రీశంకరులు ఇట్లు సెలవిచ్చిరి:—

*నిగ్రహో బాహ్యావృత్తీనాం దమ ఇత్యభిధీయతే ।*

"బాహ్యావృత్తులను నిగ్రహముచేయుట దమ మనబడును." జ్ఞానప్రాప్తికి దమము ఎంతయో అవసరము. కావున దానికి శాస్త్రములయందు ఎక్కువ ప్రాముఖ్యము ఈయబడినది.

*దమేన సదృశం ధర్మం నాన్యాలోకేషు శుశ్రుమః ।*
*దమో హి పరమో లోకే ప్రశస్తః సర్వధర్మిణామ్ ॥*

"దమమువంటి రెండవధర్మము ఏదియు ప్రపంచమున కానరాదు. అన్నిమతములయందును దమము ఉత్తమముగా నెంచబడినది." దమముచే ఈలాభము కలుగును:—

*ప్రేత్య చాముత్ర మనుజః పరమం విన్దతే సుఖమ్ ।*
*దమేన హి సమాయుక్తో మహాన్తం ధర్మమశ్నుతే ॥*

"దమమును పాలించినవాడు ఈలోకమునందును, పరలోకమునందును సుఖపడును. ఇది గొప్పధర్మము."

*6.* యజ్ఞః:— శాస్త్రవిహితములగు కర్మలు యజ్ఞములు. ఈ యజ్ఞములు రెండురకములు. శ్రుతి ప్రతిపాదితములు. స్మృతి ప్రతిపాదితములు. అగ్నిహోత్రము, దర్శపౌర్ణమాస్యలు, సోమయజ్ఞము ఇత్యాదులు శ్రౌతయజ్ఞములు. దేవయజ్ఞము, ఋషియజ్ఞము, పితృయజ్ఞము, మనుష్యయజ్ఞము, భూతయజ్ఞము—ఈ ఐదును స్మార్తయజ్ఞములు. దేవయజ్ఞము— అగ్నిహోత్రాదులు. ఋషియజ్ఞము- వేదాధ్యయన, సంధ్యా, గాయత్రీ, జపాదులు. పితృయజ్ఞము—తర్పణ, శ్రాద్ధాదులు. మనుష్యయజ్ఞము—అతిథిసేవాదులు. భూతయజ్ఞము—బలివైశ్వదేవాదులు. వీని అన్నిటియందును జపయజ్ఞము శ్రేష్ఠము. 'యజ్ఞానాం జపయజ్ఞోస్మి" యజ్ఞములలో జపయజ్ఞమును నేను అని భగవానుడు గీతయందు చెప్పెను.

*7.* స్వాధ్యాయః:- వేదాధ్యయనము. భగవానుని గుణములు, ప్రభావము, తత్త్వము, స్వరూపము, ఆయనదివ్యలీలల వర్ణనము కల వేదములను అభ్యసించుట, శాస్త్రములు, ఇతిహాసములు, పురాణములు మొదలగువానిని పఠించుట, భగవానుని నామగుణకీర్తనము, ఇవిఅన్నియు స్వాధ్యాయమే. వేదాభ్యాసము అనగాఋగ్వేదాదిచతుర్వేదములు, వేదాంగములగు శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందము, జ్యోతిషము- వీనిని చదువుట వేదాధ్యయనము అనబడును. ఇవి బాల్యావస్థనుండియు కాశి మొదలగు ప్రదేశముల యందుండి అభ్యసించవలెను. ఈరోజులలో ఇవి ఎంతోమంది చదువుట లేదు. ఇప్పటివారు గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు అధ్యయనముచేసి సంతృప్తిపడుదురు. ఆమాత్రము చేయలేకపోయినను గీతను గురువుచెంత నభ్యసించి నిత్యము మననముచేయుచు ఆచరణలో నుంచవలెను. గీతాసారమగు దైవగుణములను భక్తితో ఆచరించవలెను.

*8.* తపః :-తపముకాయికము, వాచికము, మానసికము అని మూడు విధములు. కాయికతపము గీతయందిట్లు చెప్పబడినది:—

*వ్రతోపవాసనియమైః శరీరోత్తాపనం తపః ।*

"వ్రతములు, ఉపవాసములు, నియమములు మొదలగు వానిచే శరీరమును తపింపచేయుట శారీరకమగు తపము."

వాచిక తపమనగా సత్యము పలుకుట అనవసర సంభాషణ చేయకుండుట, నిందించకుండుట, కఠోరవాక్యములను పలుకకుండుట. వాచిక, మానసిక తపములను గురించి మహాభారతములో ఇట్లు ఉన్నది:—

*అహింసా సత్యవచనం ఆనృశంస్యం దమో ఘృణా ।*
*ఏతత్తపో విదుర్ధీరా న శరీరస్య శోషణమ్ ॥*

"అహింస, సత్యము, ఇతరులను దుఃఖింపజేయు పనులు చేయకుండుట, దమము, దయ—ఇవియే మానసికమగు తపము. శరీరమును శోషింపజేయుటమాత్రము తపము కాదు."

ఉపవాసాదిమాత్రముచే శరీరమును శోషింపజేయుటచే తపస్సిద్ధి కలుగదు. ఈవిషయమున శ్రీశంకరులు పార్వతితో నిట్లు చెప్పిరి.

*దేహదణ్డనమాత్రేణ కా ముక్తి రవివేకినామ్ ।*
*వల్మీకతాడనాద్దేవి! మృతః కిం ను మహోరగః॥*

"ఓదేవి, శరీరమును కష్టపెట్టినంతమాత్రమున ఆ అవివేకికి ముక్తి కలుగునా? పాముపుట్టపై కొట్టినంతమాత్రమున సర్పము మరణించునా?"

ఇంకను శాస్త్రమున ఇట్లు ఉన్నది:—

*మాసపక్షోపవాసేన మన్యన్తే యే తపో జనాః।*
*ఆత్మతన్తూపఘాతాస్తే న తపస్తత్సతాం మతమ్॥*

"మాసము, పక్షము, రోజులు ఉపవాసము ఉండుట తపము అనుకొనెదరు. వారు ఆత్మతంతువును నశింపజేయుదురు. సత్పురుషులు దానిని తపస్సుగా నంగీకరించరు."

ఆత్మతంతువును నశింపజేయుట అనగా శరీరమును నిలబెట్టు ఆధారమును నశింపజేయుట.

*9.* ఆర్జవమ్ :—ఆర్జవ మనగా శరీరము, ఇంద్రియములు మనస్సు- వీని కర్మములను నిష్కపటముగా చేయుట.

*వ్యవహారేషు సర్వేషు మనోవాక్కాయ కర్మభిః ।*
*సర్వేషామపి కౌటిల్యరాహిత్యమార్జవం భవేత్॥*

"అన్నిప్రాణులపట్ల మనోవాక్కాయములతో కపటము లేకుండ చేయు ప్రవర్తనము ఆర్జవము అనబడును."

శాస్త్రములయందు ఆర్జవమునకు చాల ఉన్నతస్థానముకలదు. ఆర్జవము అనగా సరళత్వము. అదెధర్మమనియు, కపటము అధర్మము అనియు చెప్పబడును. సరళుడు, నిష్కపటి అగు మానవుడే ధర్మమును ఇముడ్చుకొనగలడు. ధర్మతత్త్వమును నిజముగా గ్రహించి ఆచరించగలడు.

*2. అహింసా సత్యమక్రోధః త్యాగః శాన్తిరపైశునమ్ ।*
*దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీరచాపలమ్ ॥*

"అహింస, సత్యము, అక్రోధము, త్యాగము, శాంతి, అపైశునము, భూతదయ, అలోలుప్త్వము, మార్దవము, లజ్జ, చపలత్వాభావము- ఇవి అన్నియు దైవసంపద.

*10.* అహింసా:- ఏకారణముచేతనుకూడ ఏప్రాణిని శరీరము, వాక్కు, మనస్సు- వీనిచే ఏమాత్రమును కష్టపెట్టకుండుట.

*న యత్ప్రమాదయోగేన జీవితవ్యపరోపణమ్ ।*
*త్రాసానాం స్థావరాణాం చ తదహింసావ్రతం మతమ్ ॥*

"పొరబాటునకూడ జంగమస్థావరాత్మకములగు జీవులకు హింస చేయకుండుట అహింస."

కఠోరవాక్యములను ఉచ్చరించి, నిందించి, ఎదుటవారి మనస్సును బాధించుట వాచికమగు హింస. దానిని త్యజించవలెను.

*న సత్యమపి భాషేత పరపీడాకరం వచః ।*

"ఇతరులకు దుఃఖముకలుగు సత్యమునుకూడ పలుకరాదు." ఇతరుల ఏతప్పుడు నడతవలన మనకు దుఃఖము కలుగునో అట్టి మన తప్పుడు నడతవలన ఇతరులకుకూడ దుఃఖము కలుగును అను భావమును ఎల్లప్పుడు మనస్సునందుంచుకొని ఇతరులకు బాధ కలుగజేయు ప్రవర్తనములు మానవలెను. ఎట్లనిన:—

ఆత్మవత్సర్వభూతేషు సుఖదుఃఖే ప్రియాఽప్రియే ।
చిన్తయన్నాత్మనోఽనిష్టం హింసామన్యస్య నాచరేత్ ॥

తనసుఖము తనకు ఇష్టము. దుఃఖము ఇష్టము కాదు. అటులనే ఎల్లజీవులకు వారిసుఖము ఇష్టము. దుఃఖము ఇష్టము కాదు. ఇట్లు తలచి తనకు అనిష్టకరమగుహింసను ఇతరులపట్ల ఆచరించరాదు.

*11.* సత్యమ్:— కండ్లతో చూచినదియు, చెవులతో విన్నదియు, అంతఃకరణముద్వారా అనుభవించినదియును దంభములేకుండ చెప్పుట సత్యము.

యత్ స్వేన దృష్టం సమ్యక్ చ శ్రుతం తస్యైవ భాషణమ్ ।
సత్యమిత్యుచ్యతే బ్రహ్మ సత్యమిత్యభిభాషణమ్ ॥

"తాను చూచినట్లుగను, విన్నట్లుగనే మాట్లాడుట సత్యము. బ్రహ్మము సత్యము కావున సత్యమునే పలుకవలెను."

సత్యమును ప్రతిష్ఠించియే ప్రవృత్తులన్నియు జరుగును. సత్యముచే పృథ్వి నిలచినది. సత్యముచే సూర్యుడు ప్రకాశించుచున్నాడు. సత్యముచే వాయువు వీచుచున్నది. ఇట్లు సత్యముపై ఆధారపడియే ప్రపంచమునందలి తత్త్వములు అన్నియు నడచుచున్నవి.

అంతియే కాదు. యజ్ఞాది సర్వధర్మములకంటెను సత్యము శ్రేష్ఠమైనది.

అశ్వమేధసహస్రం చ సత్యం చ తులయా ధృతమ్ ।
అశ్వమేధసహస్రాద్ధి సత్యమేవ విశిష్యతే ॥

"త్రాసుయొక్క ఒకసిబ్బియందు వెయ్యి అశ్వమేధముల ఫలమును, రెండవదానియందు సత్యమును ఉంచిన సత్యమే బరువుగా నుండును."

*12.* అక్రోధః— స్వభావదోషముచేకాని, ఇతరుల అపకారము, అవమానము, నింద, కఠినవాక్యములు— వీనిని విని కాని, లేక

అవినీతికరమగు ప్రవర్తనను చూచికాని తనకును, ఇతరులకును అపకారము చేయుటకు ప్రవర్తింపజేయు అంతఃకరణముయొక్క అభిజ్వలనము అను వృత్తి క్రోధము అనబడును. క్రోధము లేకుండుట అక్రోధము.

*ఆత్మవస్తు సముత్కర్షాదతినిష్ఠురభాషణమ్।*
*క్రోధమాహుర్ధర్మవిదోహ్యా క్రోధస్తద్విపర్యయః॥*

"అంతఃకరణమున జ్వాలనమను ప్రవృత్తిని పుట్టించి ఇతరులపట్ల కఠోరవాక్యములను పలుకుట క్రోధము. ఈ క్రోధము లేకపోవుటయే అక్రోధము."

క్రోధప్రవృత్తి మానవుని ధర్మాదిపురుషార్థములనుండి క్రిందికి పడగొట్టు గొప్ప శత్రువు. బలాత్కారముచేసి మోక్షమును దోచుకొను దోపిడిదొంగ. కావున దానిని వశపరచుకొనుము. మనుష్యుడు క్రోధమును అదుపులో నుంచుకొనినచో అదుపులో నుంచుకొనవలసినది మరియొకటి ఉండదు.

*యః సముత్పతితం క్రోధమక్రోధేన నిరస్యతి।*
*దేవయాని విజానీహి తేన సర్వం జితం జగత్॥*

"తనయందు జనించిన క్రోధమును, అక్రోధముచే నశింపజేసినవాడు జగత్తునంతను జయించినవాడుగ ఎరుగనగును."

*13.* త్యాగః :—పదార్థముల అంతస్త్యాగము, బహిస్త్యాగము కూడ త్యాగ మనబడును.

అంతస్త్యాగ మనగా భోగవిలాసములకు సాధనమగు పదార్థముల వాసనలను త్యజించుట. బహిస్త్యాగమనగా ఇల్లు, పొలము, ధనము మొదలగు భోగసాధనములగు పదార్థములను త్యజించుట. శ్రుతి ఇట్లు చెప్పుచున్నది :—

*త్యాగ ఏవ హి మహతాం పూజ్యః సద్యో మోక్షప్రదాయకః।*

"మహాపురుషులకు త్యాగమే పూజార్హము. వెంటనే మోక్షఫలమును ఇచ్చును." అంతియే కాదు. వారి మనస్సునందే మోక్షము ఉండును.

*త్యాగ ఏవ హి సర్వేషాం మోక్షసాధనముత్తమమ్।*
*త్యజతైవ హి విజ్ఞేయం త్యక్తుః ప్రత్యక్ పరం పదమ్॥*

"అన్నివర్ణములవారికిని, ఆశ్రమములవారికిని త్యాగమే మోక్షమునకు అత్యుత్తమమగు సాధనము. త్యాగముచేసినవాడు యథార్థతత్త్వమును తెలిసికొనగలడు. పరమపథము త్యాగి అంతరంగమునందే యుండును."

*14.* శాన్తిః :—ప్రాపంచిక చింతలు లేకుండ, అంతఃకరణము చాంచల్యమును విడనాడి ప్రసన్నతతో స్థిరముగా నుండవలెను. అదియే శాంతి. శాంతి మూడురకములు :—

1. బ్రహ్మనిర్వాణము :—ఇందు మనస్సు తన వికారములను త్యజించి వస్తుస్వరూపమునందు (ఆత్మస్వరూపమునందు) మాత్రమే నిలకడగా నుండును. ఇది మనస్సుయొక్క ఉత్తమశాంతి.

2. శుద్ధసత్త్వము :—బుద్ధిమాత్రము ఆత్మానుభవపరంపర యందు ప్రవహించుచుండును. ఇది మధ్యమశాంతి.

3. మిశ్రసత్త్వము :— సర్వవేదాంతసారసంగ్రహమున ఇట్లున్నది :—

*విషయవ్యాపృతిం త్యక్త్వా శ్రవణైకమనఃస్థితిః।*
*మనసశ్చేతరా శాన్తిర్మిశ్రసత్త్వైకలక్షణా॥*

"విషయవ్యాపారములను త్యజించి మనస్సు కేవలము వేదాంత శ్రవణమున స్థిరపడినచో ఒకవిధముగ మనస్సునకు శాంతి కలుగును. అది మిశ్రసత్త్వము."

*15.* అపైశునమ్:- ఇతరుల దోషములను కనిపెట్టి మరొకరితో చెప్పుట, ఇతరులను నిందించుట పిశునత్వము. ఇది లేకుండుట అపైశునము.

*16.* దయా భూతేషు:—ఏదైన ప్రాణి దుఃఖించుట చూచి నిస్వార్థ భావముతో వీలయిన ఉపాయములతో ఆ దుఃఖమును పోగొట్టుట, సుఖమును కలుగజేయుట, ఈ అభిప్రాయము, ప్రయత్నము చేయుటయు భూతదయ అని చెప్పబడును. ఇది దయాలక్షణము:—

ప్రాణా యథాఽఽత్మనోఽభీష్టా భూతానామపి తే తథా ।
ఆత్మౌపమ్యేన భూతానాం దయాం కుర్వన్తి సాధవః ॥

"తనకు తన ప్రాణము తీపి. ఇతరులకు వారి ప్రాణము తీపి. ఇట్లు తన దుఃఖమువంటిదే ఇతరుల దుఃఖమని తలచి సాధువులు ప్రాణులపై దయ చూపెదరు."

దయా ప్రాముఖ్యము ఇట్లు చెప్పబడినది:—

యస్మిన్ధర్మే దయా నాస్తి స ధర్మః దూషితో మతః ।
దయాం వినా న విజ్ఞానం న ధర్మో జ్ఞానమేవ చ ॥ (స్కంద పు.)

"ఏ మతమందు (హింసాప్రధానమగుటవలన) దయ యుండదో ఆ మతము దోషభూయిష్ఠము. దయలేనిదే మనుష్యునకు విజ్ఞానము, ధర్మము, పరమాత్మజ్ఞానము కలుగదు."

*17.* అలోలుప్త్వమ్:— ఇంద్రియములయందు సామర్థ్యము ఉన్నప్పుడు విషయములచెంత వికారమును చెందకపోవుటయు, ఇతరులుభోగములను అనుభవించుట చూచి దానియందు మనస్సు ప్రవర్తించకపోవుటయు అలోలుప్త్వము.

నచికేతుడు యముని ఆత్మవిద్య నేర్పుమని కోరెను. యముడు అతనికి దీర్ఘాయువు, సుందరవనితలు, అపరిమితధనము మొదలగు అనేకరకములగు భోగములును, ఐశ్వర్యములును అనుభవించు సాధనములను అనేకవిధములుగా వివరించెను. కాని అతను ఆశపడలేదు. అంతట యముడు సంతోషించి ఇట్లనెను:—

*విద్యాభీప్సినం నచికేతసం మన్యే, న త్వా కామా బహవో౽లోలుపన్త ।*

"నీవు జ్ఞానమును కోరుచున్నావని ఇప్పుడు నమ్ముచున్నాను. ఏలనన, నీకు వివిధపదార్థములయందు కోరిక కలుగుట లేదు."

ఇట్లని అతనికి ఆత్మవిద్యను బోధించెను.

*18.* మార్దవమ్ :—అంతఃకరణమునందును, వ్యవహారమునందును కాఠిన్యమును త్యజించవలెను. దానికి బదులుగా మృదుత్వమును కలిగియుండవలెను. మార్దవముచే ప్రాపంచికవ్యవహారము, పరమాత్మమార్గము రెండును సుకరములగును.

ఏలనన—

*మృదునా దారుణం హన్తి మృదునా హన్త్యదారుణమ్।*
*నాసాధ్యం మృదునా కించిత్తస్మాత్తీవ్రతరం మృదు॥*

"మృదుత్వము కాఠిన్యమును నశింపజేయును. అదియే మృదుత్వమును కూడ వశపరచుకొనును. మృదుత్వముచే సాధ్యముకానిది ఏదియు లేదు. కావున కాఠిన్యముకంటె మృదుత్వము తీవ్రతరమైనది."

*యస్య చిత్తం ద్రవీభూతం కృపయా సర్వజన్తుషు।*
*తస్య జ్ఞానేన మోక్షేణ కిం జటాభస్మలేపనైః॥*

"ఎవనిచిత్తము ప్రాణులయందు దయచే ద్రవీభూతమైనదో, అతనికిజ్ఞానముతోను, మోక్షముతోను, జటలతోను, భస్మములతోనుపనిమిపని?"

*19.* హ్రీః :—లోకవ్యవహారమునకు వ్యతిరేకమగు ఆచరణ చేయనిశ్చయించరాదని ధర్మశాస్త్రము చెప్పుచున్నది. కావున విరుద్ధాచరణమునకు కలుగు సంకోచము లజ్జ. మద్యాదుకాణముచెంత మిత్రులతో నిలబడి యుండునపుడు కలుగు భావము లజ్జ.

*హ్రీమాన్ హి పాపం విద్వేష్టి తస్య శ్రీరభివర్ధతే।*
*హ్రీః హతా బాధతే ధర్మం ధర్మో హన్తి హతః శ్రియమ్॥*

"లజ్జాశీలుడు పాపమును ద్వేషించును. అతనికి లక్ష్మి వృద్ధిచెందును. లజ్జను నశింపజేసిన ధర్మము నశించును. ధర్మము నశించిన లక్ష్మి పోవును."

*20.* అచాపలమ్ :—చపలత్వము లేకపోవుట.

*న పాదపాణిచపలో న నేత్రచపలో యతిః।*
*న చ వాక్చపలశ్చైవమితి శిష్టస్య లక్షణమ్॥*

"యతికి నేత్రములు, హస్తములు, పాదములు- వీనియందు చాపల్యము కూడదు. వాక్చాపల్యము కూడ పనికిరాదు. ఇది శిష్టుని లక్షణము."

కాలుపై కాలు వేసికొని కూర్చొనుట, కాళ్ళు ఊపుట, త్రోవలో నాలుగువైపులకు చూచుచునడచుట, వ్యర్థప్రసంగము చేయుట, అనవసరముగా నవ్వుట—ఇటువంటివి అన్నియు చాపల్య లక్షణములు. ఇవి లేకపోవుట అచాపలము.

*3. తేజః క్షమా ధృతిః శౌచమద్రోహో నాతిమానితా।*
*భవన్తి సంపదం దైవీం అభిజాతస్య భారత॥*

"తేజస్సు, క్షమ, ధృతి, పవిత్రత, శత్రుత్వము లేకుండుట తాను పూజ్యుడనను అభిమానము పొందకుండుట—ఇవి అన్నియు దైవసంపత్తి కల మానవుని లక్షణములు."

*21.* తేజః:— దైవసంపత్తి కలవాని ప్రభావముచే వాని చెంత అసురసంపత్తి కలవాడు దుష్కార్యములు చేయలేకపోవును. అది ఆ దైవసంపత్తి కలవాని తేజము. ఇట్టి తేజోవంతుడగు మానవుని భార్య, పుత్రులు, ధనము మొదలగునవి తమ మాయామోహమున చిక్కించుకొనలేవు. వారిచెంతకు వచ్చిన మానవుల హృదయములయందు వారివద్ద ధనాదులు లేకపోయినను తమంతట తామే పూజ్యభావము [illegible]భవించును. సర్వానర్థములకును మూలమగు క్రోధాది

శత్రువులపై వారికి విజయము కలుగును. ఇట్టి తేజోవంతునిగురించి ఇట్లు చెప్పబడినది:—

యస్తు క్రోధం సముత్పన్నం ప్రజ్ఞయా ప్రతిబాధతే ।
తేజస్వినం తం విద్వాంసో మన్యన్తే తత్త్వదర్శినః ॥

"ఉద్భవించిన క్రోధమును బుద్ధితో అణచినవానిని విద్వాంసులగు తత్త్వవేత్తలు తేజశ్శాలి అనెదరు."

*22.* క్షమా:— అపకారము చేసినవానికి ఎట్టి శిక్షను విధించరాదు. పగతీర్చుకొనవలె నను భావముకూడ ఉండరాదు. దేవుడే అతనిని శిక్షించుననుభావముకూడ ఉండరాదు. అతని అపరాధమును అపరాధముగా తలచనేకూడదు. భగవన్తుడు ఆతనికి సద్బుద్ధిని కలిగించును అను నిశ్చయముతో అతని అపకారమును మరువవలెను. ఆగుణము క్షమ. క్షమాశీలుడు భగవంతుని పొందుటకు తగినవాడు.

క్షన్తవ్యమేవ సతతం పురుషేణ విజానతా ।
యదా హి క్షమతే సర్వం బ్రహ్మ సంపద్యతే తదా ॥

"వివేకవంతుడు ఎల్లప్పుడును ఇతరులను క్షమించవలెను. ఎప్పుడైతే క్షమించునో అప్పుడే బ్రహ్మప్రాప్తికి యోగ్యుడగును."

క్షమా తేజస్వినాం తేజః క్షమా బ్రహ్మ తపస్వినామ్ ।
క్షమా సత్యం సత్యవతాం క్షమా యజ్ఞః క్షమా శమః ॥

"క్షమ తేజోవంతుల తేజము. క్షమ తపశ్శాలుల బ్రహ్మము. క్షమ సత్యనిరతుల సత్యము. క్షమయే యజ్ఞము. క్షమయే శమము."

*23.* ధృతిః :—శాస్త్రమున ధైర్యవంతుని లక్షణము ఇట్లున్నది :—

నాప్రాప్యమభివాఞ్ఛన్తి నష్టం నేచ్ఛన్తి శోచితుమ్ ।
ఆపత్సు చ న ముహ్యన్తి నరా ధృతియుతాః సదా ॥

"పొందవీలులేని వస్తువును కోరరు. నశించిన వస్తువునుగురించి విచారించరు.ఆపదలయందు బుద్ధిని కోల్పోవరు,విచారించరు. స్థిరబుద్ధి కలిగి యుందురు. అట్టివారు ధైర్యశాలురు."

మహాభయంకరములును, అత్యంతవిషమములును అగు పరిస్థితులయందు ధైర్యముగా నుండుట శ్రేయస్కరము అని మహాభారతమున చెప్పబడినది.

*పుత్రదారైః సుఖైశ్చైవ వియుక్తస్య ధనేన వా।*
*మగ్నస్య వ్యసనే కృచ్ఛ్రే ధృతిః శ్రేయస్కరీ నృప॥*

"ఓధర్మరాజా! పుత్రులు, భార్య, ధనము మొదలగునవి నశించుట మొదలగు అత్యంతకఠినదుఃఖములయందు చిక్కుకొనియున్నను మానవుడు ధైర్యమును విడనాడకుండుట కల్యాణకరము."

***24.*** శౌచమ్ :— శౌచమనగా పవిత్రత. అది రెండు రకములు. బాహ్యము, ఆంతరము. పరిశుద్ధములగు జలాదులద్వారా శరీరమును శుభ్రముగా నుంచుకొనుట బాహ్యశౌచము. రాగద్వేషాదిరహితముగా నుండుట ఆంతర శౌచము.

*అభక్ష్యపరిహారశ్చ సంసర్గశ్చాప్యనిన్దితైః।*
*స్వధర్మే చ వ్యవస్థానం శౌచమేతత్ప్రకీర్తితమ్॥*

"అభక్ష్యములగు పదార్థములను భక్షించకుండుట, నిందితులు కాని వారు అనగా సదాచారశీలురగు పురుషుల సహవాసముచేయుట, తన మతమునందు స్థిరముగా నుండుట—ఇది శౌచము."

సాత్త్వికబుద్ధిని నశింపజేయు పదార్థములు అభక్ష్యములు. మాంసమదిరాది తామసపదార్థములు అభక్ష్యములు వీటిని అన్నిటిని త్యజించవలెను.

చరిత్రహీనుడు, అభక్ష్యభోగి, అవినీతుడు ప్రత్యక్షదోషభాషి నింద్యులు. ఇందుకు వ్యతిరేకమగు స్వభావముకల సద్గుణవం

తుల సహవాసము చేయవలెను. ఎంత క్లిష్టపరిస్థితియందైనను వర్ణాశ్రమధర్మములను త్యజించరాదు.

జ్ఞాని ఈ దైవసంపదకొరకు వాచిక, మానసిక శౌచమునుకూడ అవలంబించును.

వాచాం శౌచం చ మనసః శౌచమిన్ద్రియనిగ్రహః,
సర్వభూతదయా శౌచమేతచ్ఛౌచం పరార్థినామ్॥

"మనోవాక్కుల పారిశుద్ధ్యము, ఇంద్రియనిగ్రహము, సర్వభూతముల యందును దయ, అనగా పవిత్రభావము, ఇది పరోపకారబుద్ధికల వారు అవలంబించు శౌచము."

*25.* అద్రోహః :—తనపట్ల శత్రుత్వము వహించువాని యందు ఏకాంచెము ద్వేషముకాని, శత్రుత్వముకాని కలిగియుండక పోవుట అద్రోహము.

సర్వేషామేవ భూతానాం హరిర్నిత్యం హృది స్థితః,
స ఏవ హి పరాభూతో యో భూతద్రోహకారకః॥

"అన్ని ప్రాణులహృదయములయందును ఎల్లప్పుడును దేవుడు ఉండును. కావున ఆప్రాణులకు ద్రోహముచేయుట యనిన దేవునకు ద్రోహము చేయుటయే."

*26.* నాతిమానితా :—తాను శ్రేష్ఠుడను, గొప్పవాడను' పూజ్యుడను అనియు గౌరవము, సత్కారము, పూజ మొదలగునవి కావలెననియు, కోరుటయును, కోరికలేకపోయినను అవి లభించినపుడు సంతోషించుటయును అతిమానిత. అది యుండరాదు. ఈవిషయమున సర్వవేదాంతసారసంగ్రహమున ఇట్లు ఉన్నది.

శ్రేష్ఠం పూజ్యం విదిత్వాఽమాం మానయన్తు జనా భువి,
ఇత్యాసక్త్యా విహీనత్వం మానానాస్త్తిరుచ్యతే॥

"జనులు నన్ను గొప్పవాడను, పూజించదగినవాడను అని అనుకొని పూజించవలెను అను భావములేకపోవుట అనాసక్తి అనబడును."

దైవీ సంపత్ :—దేవునితో సంబంధము ఉంచుకొనదలచినవాడు తన దేవప్రాప్తికి సాధనమగు సదాచారమును, సద్గుణసముదాయమును కలిగియుండును. ఇది దైవసంపద అనబడును. ఇదియే దైవ ప్రకృతి. పైన చెప్పబడిన 26 గుణములుకల మానవుడు దైవసంపద కలవాడని చెప్పబడును. ఈ 26 గుణములును మిశ్రసత్త్వమునకు సంబంధించినవి. జ్ఞానము శుద్ధసత్త్వము. శుద్ధసత్త్వముననే బ్రహ్మ సాక్షాత్కారము కలుగును.

దైవసంపత్తికలవాడు పరమాత్మతత్త్వమునందే చిత్తమును నిలబెట్టును. తద్వ్యతిరిక్తములగు మాయికపదార్థములవైపునకు పోనివ్వడు. పరమాత్మ యనిన అతనికి ఎంతయో ప్రియము. ఆయన భజనచేయనిదే అతని మనస్సునకు గాని, బాహ్యేంద్రియములకు గాని మరియొకటి సొకదు.

## దైవసంపదకలవాని భక్తి

మూలశ్లోకమున "జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్." అనగా వారు దేవుని అన్ని భూతములకును ఆదికారణమనియు, ఎప్పుడు నశించనిది అనియు తెలిసికొని భజించెదరు. శ్రుతి ఇట్లు చెప్పుచున్నది:—

*యతో వా ఇమాని భూతాని జాయన్తే, యేన జాతాని జీవన్తి,*
*యత్ప్రయన్త్యభిసంవిశన్తి తద్విజిజ్ఞాసస్వ తద్ బ్రహ్మేతి ॥*

"ఏ పరమాత్మనుండి సర్వప్రాణులును ఉద్భవించుచున్నవో, ఎవనిద్వారా జీవించుచున్నవో, ప్రళయమునందు ఎవనియందు ప్రవేశించుచున్నవో, అతడు బ్రహ్మము. అతనిని తెలిసికొనుటకు ప్రయత్నించుము."

మూలశ్లోకమున "మహాత్మానః అనన్యమనసః మాం భజన్తి" అని ఉన్నది. విశాలమైనదియు, మహత్తరమైనదియు అగు అంతఃకరణము కలవారు మహాత్ములు. ఈమహాత్ములు "అభయం సత్త్వసంశుద్ధిః" అను శ్లోకములద్వారా చెప్పబడిన దైవప్రకృతిని కలిగియుందురు. అనగా సాత్త్వికప్రకృతిని కలిగియుందురు. పరమేశ్వరుడనగు "నేను" తప్ప మాయాజన్యములగు ఇతరములైన స్త్రీధనాదులయందు మనస్సు కలిగియుండరు. ఇట్లు నన్ను అనగా పరమేశ్వరుని జగత్తు అంతకును కారణముగా భావించి భజించవలెను.

## దైవసంపద పరంపరాలభ్యము.

దైవసంపదయందలి గుణములలో ఒకటి రెంటిని జాగ్రత్తగా ఆచరించిన మిగిలినవి తమంతట తాము లభించును.

ఒక స్వామి మహాత్ముడు ఒక గ్రామమునకు గ్రామాంతరము నుండి వచ్చెను. ఆయన వద్దకు చాలమంది వెళ్ళుచుండిరి. అది చూచి ఒకడు ఆయనచెంతకు వెళ్ళి ఏదైన మంత్రము ఉపదేశించమని ప్రార్థించెను.

స్వామి ఇట్లడిగెను:—"అబ్బాయి, నీవు ఏమిపని చేయుదువు?

అతడు:— "దొంగతనము."

స్వామి:— అదికాక వేరొక పని ఏదైన చేయుదువా?

అతడు:— "జూదమాడెదను. కల్లుతాగెదను. ఇట్టి అవినీతికరములగు పనులు చాలమార్లు చేసెదను. అబద్ధముకూడ ఆడెదను."

స్వామి:— "సరే, వీని అన్నిటిలోను ఏదో ఒకటి మానుటకు ప్రతిజ్ఞ చేయుము."

ఆతడు ఇట్లు ఆలోచించెను— "దొంగతనము చేయనిచో ఆకలితో చచ్చెదను. కల్లుత్రాగుట మానలేను. ఏదియు విడచుటకు వీలు అగుటలేదు. ఒక అబద్ధము ఆడుట మానగలనని నాకు తోచుచున్నది."

స్వామివారికి అతడు ఇట్లు చెప్పెను:-

"స్వామీ, నేటినుండి అసత్యము పలుకను."

స్వామివారు 'సరే' అని అతనికి మంత్రదీక్ష నిచ్చిరి. కొద్ది దినముల తరువాత అతడు దొంగతనము చేయుటకు రాజభవనమునకు వెళ్ళెను. అతడు గోడపైనుండి రాజభవనపు పైభాగమునకు వెళ్ళెను. ఆరోజున ఎండ అధికముగా నుండుటచే రాజు పైభాగమున తిరుగుచుండెను. "ఎవరవు" అని రాజు ప్రశ్నించెను.

దొంగ:- "నేను దొంగను. నీవు ఎవరవు?"

రాజు:- నేనును దొంగనే! మనమిద్దరము కలసి ఖజానా దొంగిలించెదము. కాని నీవు దొంగవను నమ్మకమేమి? తీరా పట్టించి వేయుదువేమో!" దొంగ, తాను అబద్ధమాడనని గురువుచెంత చేసిన ప్రతిజ్ఞను వివరించి చెప్పెను. రాజునకు అతనిపై నమ్మకము కలిగెను. అనంతరము అతడు దొంగతో ఇట్లనెను:— నేను తాళముచెవులు సంపాదించితిని. నీపని తేలికచేసితిని. తరువాత వారిరువురును కలసి ఖజానా తెరచి నగలను సంగ్రహించిరి. పిదప వారిరువురును పంచుకొనుచు వారు ఒక బంగారుపెట్టెనుండి మూడు వజ్రములను తీసికొనిరి. అవి ఎట్లు పంచుకొనవలెను అను సందేహము కలిగెను. అప్పుడు రాజు ఇట్లనెను. ఒక వజ్రము రాజునకు ఉండనిచ్చి మిగిలినవి మనము పంచుకొనెదము. అట్లు చేసి వారు ఇరువురును విడిపోయిరి. రాజు దొంగ యొక్క చిరునామా తీసికొనెను. తన చిరునామా సరియైనది ఇవ్వలేదు. రెండవరోజున దివానును పిలచి "దొంగతనము జరిగినది. ఏమేమి పోయినవో తెలిపి, దొంగను పట్టుకొనుము" అని ఆజ్ఞాపించెను. దివాను ఖజానాను వెతికెను. ఒక వజ్రము దొరికెను. అతడు దానిని తన మొలలో దాచుకొనెను. రాజుచెంతకు వచ్చి దివాను ఇట్లు చెప్పెను:- ఏమియు మిగల్చలేదు. అన్నియు తీసికొనిపోయెను. దొం

గను ఎంతైన వెతికితిని. కాని ఏమాత్రము జాడ తెలియుటలేదు."
అంతట రాజు దొంగయొక్క చిరునామా తెలిపి తీసికొని రమ్మని ఆజ్ఞాపించెను. దొంగ హాజరయ్యెను. రాజు అడిగెను:—

"దర్బారులో దొంగతనము జరిగినది. నీకు తెలియునా?" దొంగ అంగీకరించెను. "నేను దొంగతనము చేసితిని." రాజు అడిగెను— "అన్నియును తీసికొని వెళ్ళితివా! ఏమైన మిగిల్చితివా?" దొంగ పలికెను— "మూడువజ్రములుండెను. మేము ఇద్దరము. ఒక్కొక్కరము ఒక్కొకవజ్రము తీసికొంటిమి. ఒకటి తమకొరకు ఉంచితిమి." రాజు దివానుతో నిట్లనెను. "ఆవజ్రము నీదగ్గర ఉన్నది. బయటకు తీయుము."

దివాను ఏమియు చేయలేక తనవొద్దనుండి వజ్రమును బయటకు తీసెను.

రాజు:— "నేటినుండి ఈదొంగ దివాను. కారణమేమనగ, ఇతడు నిజము చెప్పుచున్నాడు. నమ్మదగినవాడు."

అనంతరము ఆరాజు దొంగతో నిట్లనెను. "నీకు నిజము చెప్పుమని ఆజ్ఞాపించిన గురువులు ధన్యులు. వారి ఆజ్ఞను నీవు పాలించి, ఈ స్థితికి వచ్చితివి. నీవు దర్శించిన ఆగురువుగారిని నేనుకూడ దర్శించెదను. నాకు కూడ చూపుము. వారి సదుపదేశమును నేను స్వీకరించెదను."

ఇది విని దొంగ ఇట్లు విచారించెను. "ఒక సత్యవాక్పాలనము మాత్రముననే నేను దివాను పదవిని పొందితిని." ఇట్లు తలచి ఆతడు దైవసంపదకుచెందిన ఇతరగుణములను ఆచరణలో పెట్టుటకు ప్రయత్నించెను. కొలది రోజులతరువాత గురువులు అచ్చటికి వచ్చిరి. ఆక్రొత్త దివాను వెళ్ళి దర్శించెను. దివాను ఆగురువుగారి పాదములపై పడి నమస్కరించెను.

స్వామి :—"నీవెవరవు?"

దివాను :—పూర్వము ఈనగరములోనికి తమరు వేంచేసి నప్పుడు తమరు అందరకు ధర్మోపదేశము చేసిరి. దీక్ష నిచ్చుచుం డిరి. నేను తమచెంతకు వచ్చి ధర్మదీక్ష నిప్పించమని ప్రార్థించితిని. తమకు నేను దొంగననియు, జూదమూడెదననియు, అసత్యమాడెద ననియు నాపరిచయము నిచ్చితిని. అప్పుడు అన్ని పాపములను చేసెడి వాడను. వానిని విడిచిపెట్టుమని తమరు ఆజ్ఞాపించిరి. కాని అవి విడువలేనని చెప్పితిని. కేవలము సత్యమును మాత్రము పలుకగలనని చెప్పితిని. ఆ సత్యపాలనముచేతనే ఇక్కడిరాజుగారు నన్ను నమ్మ దగినవాడుగా ఎంచి నాకు ఈ దివానుపదవిని ఇచ్చిరి. ఈ సత్యవా క్పాలనమున ఆరంభములో నాకు అనేకకష్టములు కలిగినవి. కాని చివరకు నాకే విజయము కలిగినది.'' ఇది విని గురువు చాలసంతో షించి ఆనందముతో పలికెను.

"నాదగ్గర చాలమంది దీక్ష గైకొనిరి. కాని పాలించిన వాడవు నీవు మాత్రమే.''

దివాను స్వామివారి అనుమతి తీసికొని రాజుగారికి వారి దర్శనము చేయించెను. అనంతరము రాజాజ్ఞను గైకొని ఇట్లనెను:—

"నేను ఈదివానుపదవిని త్యజించి గురుసేవను స్వీకరించు చున్నాను.''

ఇది విని రాజునకు ఆశ్చర్యము కలిగెను. అతడు ఇట్లనెను. "సాంసారికపదార్థములను త్యజించి సత్పురుషుల సంసర్గముతో త్యాగశీలురయినవారు ధన్యులు,''

రాజుకూడ ఆమహాత్ముని సదుపదేశమును తీసికొని తనరాజ్య మును తనకుమారునికి ఇచ్చివేసెను.

వారిరువురును ఆమహాపురుషుని వెంటనుండి దైవసంపదకు సంబంధించిన నియమములను పాటించి శుద్ధసాత్త్వికమోక్షమును పొంది సంసారమునుండి నివృత్తులయిరి.

ఇటులనే ఒక దైవగుణము కలిగినచో మిగిలిన గుణములు వాటి అంతట అవియే కలుగును.

ఇప్పుడు ఒక శంక కలుగవచ్చును. పురాణములయందు దేవతలనుగురించి చెప్పబడియున్నది. వారిలో కొందరు విషయలంపటులుకదా! అది దైవగుణమా? అని.

## అసురులతో సమానులైన దేవతలు

ఈవిషయమున ఆత్మపురాణమున ఇట్లున్నది:—

*ఆత్మజ్ఞానముపేక్ష్యాథ దేవా యే భోగలమ్పటాః ।*
*అసురా ఏవ తే జ్ఞేయా ఆత్మధర్మబహిష్కృతాః ॥*

"ఏ దేవతలు ఆత్మజ్ఞానమును ఉపేక్షించి భోగలంపటులగుదురో అట్టి ఆత్మజ్ఞానబహిర్ముఖులగు దేవతలు అసురులవంటివారే."

ఇట్టి దేవతలయందలి దేవశబ్దము సంజ్ఞామాత్రము. కారణము వారియందు దైవసంపద లేకపోవుటయే. బృహదారణ్యకోపనిషత్తునందు ఈ కథ యున్నది.

## అధికారానుగుణమైన గ్రహణము.

దేవతలును, మనుష్యులును, అసురులును ప్రజాపతియొక్క బిడ్డలు. వారు తమ తండ్రియగు ప్రజాపతిచెంతకు వచ్చి అడిగిరి.

"మాకు ఏమైనా ఉపదేశించుడు.

వారికి ప్రజాపతి ఏకాక్షరమగు "ద" ను ఉపదేశించి ఇట్లడిగెను. "మీకు నా ఉపదేశము బోధపడినదా?"

దేవతలు చెప్పిరి:— మేము స్వభావసిద్ధముగా ఇంద్రియలోలురము. భోగవిలాసములయందు మునిగిఉండెదము. కావున మావంటి వారికి దమనమే ముఖ్యధర్మము అను ఈ ఉపదేశమునకు బీజముగా మీరు "ద" అను అక్షరమును ఉచ్చరించిరి. ఇదివిని ప్రజాపతి "ఓం"

అని పలికెను. "అనగా యథార్థము" అని అర్థము. దేవతలు తన ఉప దేశపు రహస్యము తెలిసికొనిరి అని గ్రహించెను.

అనంతరము మనుష్యులు ప్రజాపతిని "ఆజ్ఞాపించు" డని ప్రార్థించిరి. ప్రజాపతి వారికికూడ "ద" అను అక్షరమునే ఉచ్చరించెను. వారినికూడ ప్రజాపతి నాఉపదేశపు అర్థమును తెలిసికొనిరా? అని అడిగెను.

మనుష్యులు ఇట్లనిరి:- "మేము స్వాభావికముగా లోభాది వికారములకు లోనగుదుము. మేము అన్నాదులను దానము చేయుటకు బాధపడెదము. కావున మాకు దానము చేయుడని ఉపదేశించిరి." ప్రజాపతి వారికికూడ అది యథార్థమే అని చెప్పెను. పిదప అసురులు ప్రజాపతిని ఉపదేశింప నర్థించిరి. వారికికూడ ప్రజాపతి "ద" వర్ణమునే ఉపదేశించెను. తాత్పర్యము తెలిసినదా? అని వారిని కూడ అడిగెను.

అసురులు ఇట్లు సమాధానము చెప్పిరి:—"మేము హింసాపరాయణులము. ఇది మాస్వభావము. కావున మమ్ము ప్రాణుల యందు దయ కలిగి యుండవలెనని ఉపదేశించిరి." ఇది విని ప్రజాపతి వాస్తవమే అని చెప్పెను.

పైకథనుండి ప్రకృతిసిద్ధసంస్కారమును, అధికారమును కల విషయములయందు, ఆత్మకల్యాణమునకు వేరొక ప్రక్రియద్వారా శ్రేయస్సును సాధించు విధానము వెల్లడి అగుచున్నది. అనగా దేవతలు స్వాభావికముగా విషయలోలురు. వారికి ఇంద్రియ దమనము అవసరము అని శ్రుతియందే విధించబడియున్నది. కావున దేవశబ్దము ఇచ్చట్ల కేవలము సంజ్ఞార్థకమే.

## ప్రకృతి భేదములు.

గీత నవమాధ్యాయమున ప్రకృతి మూడు రకములుగా చెప్పబడినది. దైవ, రాక్షస, అసుర ప్రకృతులు. కాని 16 వ అధ్యాయ

ములో రెండు రకములుగానే చెప్పబడినది. దైవ, అసుర ప్రకృతులు. అనగా రాక్షసప్రకృతి అసురప్రకృతియందు అంతర్భూత మగు చున్నది.

మూలశ్రుతియందు 'ద్వయాః ప్రాజాపత్యాః దేవాశ్చాసురాశ్చ' అని చెప్పబడినది. అనగా ప్రజాపతికి దేవతలు, అసురులు అను ఇరు తెగల సంతానము కలదని అర్థము. ఇట్లు దేవతలను అసురులను నిర్దేశించిన శ్రుతిని అనుసరించి వారి ప్రకృతిని అనుసరించి సామా న్యముగా ప్రకృతిని రెండుభాగములుగా చేసిరి. అసురప్రకృతినుండి రాక్షసప్రకృతిని వేరుచేసిన, మూడురకములు.

అసురప్రకృతి రాగప్రధానము, రాగము ఉన్నచోట ద్వేషము ఉండితీరును. ధనాదులయందు కాంక్షకలవాడవుడు వానిని సంపాదించ ప్రయత్నించును. అందు విఘ్నములు కలిగిన ద్వేషము కలుగును. అది రాక్షసప్రకృతి.

16 వ అధ్యాయమునందలి మొదటి మూడు శ్లోకములలోను దైవప్రకృతి ప్రతిపాదించబడినది. నాలుగవ శ్లోకమున రాక్షసప్రకృ తిని అంతర్భూతముగావించి ఆసురప్రకృతి వర్ణింపబడినది.

4. దమ్భో దర్పోఽభిమానశ్చ క్రోధః పారుష్యమేవ చ ।
అజ్ఞానం చాభిజాతస్య పార్థ సంపద మాసురీమ్ ॥

"రజస్తమోగుణములతో కూడిన అశుభకరములగు వాసనల ద్వారా జన్మించిన పురుషుడు దంభము, దర్పము, అభిమానము, క్రోధము, పారుష్యము, అజ్ఞానము అను దోషములను అన్నిటిని పొందును."

వీనిలో దంభము అసురగుణము. అది రాగముచే ఉత్పన్న మగును. దర్పము ద్వేషప్రధానము. కావున రాక్షసగుణము. అందు తనకంటె గొప్పవానిని తక్కువవానిగా భావించి తనగొప్పతనమును

ఇతరులయెదుట నిలబెట్టుకొనవలెనను వృత్తియుండును. అభిమాన మనగా "నేను అత్యంత శ్రేష్ఠుడను పూజ్యుడను" అను అహంభావము కలిగియుండుట. అదిరాగప్రధానముగుటచే అసురగుణము. పారుష్య మనగా కాఠిన్యము. ఇది రాక్షసగుణము. ద్వేషముచే జన్మించును. ఈదోషములు అన్నిటికిని మూలకారణము అజ్ఞానము.

గీతయందు ఇట్లు అసురప్రకృతియందు రాక్షసప్రకృతి అంత ర్భూతము కావింపబడినది. కావుననే భగవానుడిట్లు చెప్పెను:—

*దైవీ సంపద్విమోక్షాయ నిబన్ధాయాసురీ మతా ।* దైవసంపద మోక్షమునకును, అసురసంపద బంధనమునకును కారణములు.

## గీతప్రకారము దైవసంపదకు అవసరమైన ప్రధానగుణము.

దైవసంపదకు పరమాత్మునియందు ఆస్తికబుద్ధి కలిగియుండుట ప్రధానలక్షణము. ఆస్తికుడయి అనన్యభావముచే భగవద్భక్తి కల వానియందు దైవసంపదకు చెందిన గుణములు అన్నియు ఉండును. దుర్మార్గుడుకూడ సన్మార్గుడు అగును.

*అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్ ।*
*సాధురేవ స మన్తవ్యః సమ్యక్ వ్యవసితో హి సః ॥*

"అత్యంతదురాచారపరుడయినను అనన్యచిత్తముతో ఒకడే అయిన పరమాత్మునియందు మనస్సు ఉంచి నన్ను భజించినచో అత నిని సాధువుగా అంగీకరించవచ్చును. ఏలనన, అతని నిశ్చయము ఉత్తమము."

*క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాన్తిం నిగచ్ఛతి ।*
*కౌన్తేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥*

"అతడు వెంటనే ధర్మాత్ముడగును. అతనికి వెంటనే శాశ్వత శాంతి కలుగును. నాభక్తులు నశించరు. ఇది నిశ్చయము."

వేమన్న దక్షిణ దేశపు ఒక జమీందారుని కుమారుడు. ఒక సంవత్సరము బాలుడుగా నుండగా అతని తలిదండ్రులు చనిపోయిరి. అతని అన్నగారు అతనికంటె ఇరువది సంవత్సరములు పెద్దవాడు. అతడు వేమన్నను పెంచి పెద్దవానిని చేసెను. అతని వదినెగారు అతనిని కుమారునివలె చూచుచుండెను. వేమన్న పెద్దవాడయిన కొలదియు విచ్చలవిడిగా తిరిగి పాడగుచుండెను. దుర్మార్గుడయి ఒక వేశ్యకు లోబడెను. ఎల్లప్పుడును అతడు వేశ్య ఇంట ఉండెడివాడు. ఇంటిలోని ధనమునంతయు పాడుచేసెడివాడు. ఒకటి రెండుమారులు వదినెగారిని అడిగికూడ వేశ్యకొరకు ఆభరణములను తీసికొని వెళ్ళెను. మరొకమారు వేశ్యకొరకు వదినెగారిని ముక్కునత్తు నడిగెను. అంతట ఆమె ఇట్లు చెప్పెను. నేను ఇది నీకు ఇచ్చెదను. కాని ఒకమారు నీవు ఆమెవద్దకు వెళ్ళి ఈమాట అడిగి రమ్ము. ఆమె వస్త్రములను విసర్జించి, ఆభూషణములను తీసివేసి నగ్నముగా నత్తు తీసికొనుటకు నీ ఎదుటకు వచ్చునా? అట్టి పరిస్థితిలోనే నత్తు ఇవ్వబడును. అందుకు ఆమె సిద్ధముగా నున్నదా? అని చెప్పెను.

వేమన్న ఇట్లనెను:– అందులో గొప్ప ఏమి ఉన్నది?

అనంతరము ఆమె అందుకు సిద్ధముగా నున్నదని తెలిసికొని వదిన వేమన్నకు నత్తు ఇచ్చి ఇట్లు చెప్పెను:–

"నీవు జాగ్రత్తగా పరిశీలించి చూడుము. ఆమె శరీరమున రక్తము, మాంసము, ఎముకలుతప్ప మరేమైన ఉన్నవా? అతి జాగ్రత్తగా పరిశీలించిన తరువాతనే ఈనత్తు ఇమ్ము."

అట్లు ఆమెను చూచినంతనే వేమన్నకు ఆవేశ్య శరీరము మాంసపిండము, అస్థికూటముమాత్రమే అని తోచెను. వస్తువును నిజరూపమున చూచినంతనే దోషదృష్టి పోయెను. నత్తు ఇచ్చిన వెం

టనే వైరాగ్యము కలిగెను. ఇక వేమన్న ఇంటికి మరలరాలేదు. అరణ్యములోనికి వెళ్ళిపోయెను. అచ్చట ఒకానొక యోగిపుంగవుని కృపాకటాక్షముచే ఆదుర్మార్గుడు సన్మార్గుడయ్యెను. ఇటులనే దురాత్ముడయినను భగవంతునియందు అనన్యభావము ఉంచుటచే సిద్ధపురుషు డగును.

పరమాత్మనియందు ఆస్తికబుద్ధి దైవసంపద పొందుటకు ముఖ్యము.

అనంతరము శ్రీప్రకాశానందస్వామివారు భిక్షచేసి జామ్‌నగరు వెళ్ళిరి.